క్లుప్తంగా

ఆదివాసీల పోరాటయోధుడు భీం



భీం విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: ఆదివాసీల హక్కుల పోరాటం చేసిన యోధుడు భీం అని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. మండలంలోని రౌట సంకెపల్లి గ్రామంలో భీం, ఎడ్ల కొండు విగ్రహాలకు శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల కోసం జల్ జంగల్ జమీన్ కోసం పోరాటం చేసిన వీరుడని, అతని ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్, ఉత్సవ కమిటీ చైర్మన్ కిష్టయ్య, నాయకులు వందన, ప్రసాద్, నిజాం, వెంకన్న ఉన్నారు.

ఎన్నికల జనరల్ అబ్జర్వర్‌కు స్వాగతం



మొక్కను అందిస్తున్న కలెక్టర్, ఎస్పీ

రెబ్బెన(ఆసిఫాబాద్): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో నిర్వహణ ప్రక్రియను పరిశీలించేందుకు వచ్చిన ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రాహుల్ రంజన్‌ను గురువారం రాత్రి కలెక్టర్ హేమంత్ సహదేవ్‌రావు, ఎస్పీ సురేశ్‌కుమార్ ఘనస్వాగతం పలికారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి గెస్ట్‌హౌస్ వద్ద ఆయనకు మొక్కను జ్ఞాపిక అందజేశారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు తీసుకుంటున్న ముందస్తు చర్యలను ఆయనకు వివరించారు. జిల్లా భౌగోళిక పరిస్థితులు, ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

నాణ్యమైన విద్యనందించాలి



మాట్లాడుతున్న బలిరాం

కెరమెరి: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని అనార్‌పల్లి స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాథోడ్ బలిరాం అన్నారు. మండలంలోని శంకర్‌గూడ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు మెనూ తప్పనిసరిగా పాటించాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి పెట్టాలన్నారు. ఎస్సీఆర్పీ నరేశ్, టీచర్లు సునీల్, తానాజీ తదితరులున్నారు.

వచ్చేనెల 10న పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మాట్లాడుతున్న నిర్వాహకులు

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలోని వాసవీభవన్‌లో డిసెంబర్ 10న జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సునీల్ మసాదే, శిర్ప అశోక్, వల్లపు అశోక్, గుండ బాలేశ్వర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. జెడ్పీహైస్కూల్‌లో 1963 నుంచి 1971 వరకు పదేళ్ల పాటు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళంలో పాల్గొనాలని కోరారు. పూర్వ విద్యార్థులు భావ్‌రావు మసాదే, శ్రీకాంత్ ఆచార్య, పుల్లూరి కిష్టయ్య, సుగుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్ వద్ద విస్తృత తనిఖీలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): శాసనసభ ఎన్నికల నేపథ్యంలో హాజీపూర్ మండలం గుడిపేటలో ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం వాహనాల తనిఖీలు విస్తృతంగా చేపట్టారు. హాజీపూర్ ఎస్సై నరేశ్‌కుమార్, చెక్‌పోస్ట్ ప్రత్యేక అధికారులు సీడీపీఓ హేమసత్య, ఏఎస్సై రాజేశ్‌లతో పాటు సీఆర్‌పీఎఫ్ బలగాలు వాహనాలను నిలిపి తనిఖీలు జరిపారు. ఈ చెక్‌పోస్ట్‌లో రోజుకు 500 వరకు వాహనాలను సోదాలు నిర్వహిస్తుండగా, ప్రతీ కారును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. మంచిర్యాల నుంచి హాజీపూర్ మండలం దాటి వెళ్తున్న వాహనాలను ఆపి మరీ తనిఖీ చేపడుతున్నారు. చెక్‌పోస్ట్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, ఎన్నికల కమిషన్‌కు అనుసంధానం చేసి ఉండగా వాహనాల తనిఖీ ప్రక్రియను పూర్తి వీడియోగా చిత్రీకరిస్తున్నారు.

నిలిచిన బీటీ పనులు



బీటీ నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం



కర్జి నుంచి మొట్లగూడ వరకు ఉన్న మట్టి రోడ్డు(ఫైల్)

- అటవీశాఖ అనుమతులు రాకనే..
- 2018లో పీఎంజీఎస్‌వై కింద నిధులు మంజూరు

దహెగాం: అంగట్లో అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నచందంగా మారింది మొట్లగూడ బీటీ రోడ్డు నిర్మాణం. మారుమూల గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యం మెరుగుపర్చడానికి కేంద్రప్రభుత్వం ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద నిధులు మంజూరు చేస్తోంది. నిధులు మంజూరైనట్లే కాని రోడ్డు పనులు ఏళ్లుగా ముందుకు సాగడం లేదు. అడవి ఉన్నందున అటవీ శాఖ అనుమతులు లేని కారణంగా బీటీ నిర్మాణం నిలిచిపోయింది. ఐదేళ్లయినా అనుమతులు లేవని, అధికారులు సైతం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పీఎంజీఎస్‌వై కింద రూ.6.25 కోట్లు

మండలంలోని కర్జి నుంచి రాంపూర్ మీదుగా మొట్లగూడ వరకు 14 కి.మీ బీటీ నిర్మాణం కోసం 2018లో పీఎంజీఎస్‌వై కింద రూ.6.25 కోట్లు మంజూరయ్యాయి. బీటీ కోసం శిలాఫలకం వేసి ప్రజాప్రతినిధులు పనులు ప్రారంభించారు. అంతే పనుల్లో మాత్రం పురోగతి లేదు. కర్జి నుంచి రావులపల్లి క్రాస్‌రోడ్డు వరకు అటవీ ప్రాంతం ఉండడంతో అనుమతులు ఇవ్వక బీటీ పనులు నిలిచిపోయాయని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్జి అవతలివైపు రాంపూర్, రావులపల్లి, మొట్లగూడ, టేపర్‌గాం, శంకరపురం గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో అధికంగా గిరిజనులు నివసిస్తున్నారు. బీటీ మంజూరైందని సంబురపడ్డ గిరిజనుల్లో ఐదేళ్లుగా నిరాశ నెలకొంది. పలుమార్లు అధికారులు, నాయకులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో మంజూరైన రోడ్డు వేస్తారా లేదోనని అనుమానం కలుగుతుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బీటీ రోడ్డు నిర్మించి పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన కంపెనీ లెవల్ సాంస్కృతిక పోటీలు



భరతనాట్యం చేస్తున్న మహిళా ఉద్యోగి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఏరియా జీఎం రవి ప్రసాద్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాలలో కంపెనీ లెవల్ సాంస్కృతిక పోటీలు అట్టహాసంగా కొనసాగాయి. గురువారం ప్రారంభమైన ఈ పోటీలు శుక్రవారం ముగిశాయి. రెండు రోజుల పాటు కొనసాగిన ఈ పోటీలకు సింగరేణిలోని వివిధ ఏరియాలకు చెందిన కళాకారులు హాజరై తమ ప్రతిభను చాటుకున్నారు. భరత్‌నాట్యం, కూచిపూడి వంటి సంప్రదాయ నృత్యాలతోపాటు వివిధ సాంస్కృతిక అంశాల్లో కళాకారులు పోటీపడి ప్రతిభను కనబర్చారు. ముగింపు కార్యక్రమానికి బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్ హాజరై విజేతలకు బహుమతులు అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏటా వార్షిక క్రీడల నిర్వహణ ద్వారా సింగరేణి ఉద్యోగుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాలు వెలికితీసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. సింగరేణి పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు, కళాకారులు ఇదే స్ఫూర్తితో కోలిండియా పోటీల్లో తమ సత్తా చాటాలని కోరారు. ఎస్‌వోటూజీఎం నరేందర్, పర్సనల్ మేనేజర్ తిరుపతి, డబ్ల్యూపీఎస్ గౌరవ కార్యదర్శి ప్రశాంత్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మురహరి, ఆర్గనైజర్లు చంద్రకుమార వెంకటేశ్వర్లు, విద్యాసాగర్, కిరణ్, మహేశ్, కిరణ్‌బాబు, దేవేందర్, మహేందర్, చందర్ పాల్గొన్నారు.

బీజేపీకి పలువురి రాజీనామా

ఆసిఫాబాద్: నియోజకవర్గంలోని పలువురు బీజేపీ నాయకులు రాజీనామా చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు యలమంచి సునీల్ చౌదరి, కుందారపు బాలకృష్ణ, మల్రాజు రాంబాబు పదవులతోపాటు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు జిల్లా అధ్యక్షుడికి శుక్రవారం లేఖ పంపారు.

బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ హరీశ్‌బాబు నామినేషన్ పర్వాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ప్రధాన వీధుల గుండా బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. హరీశ్‌బాబు నివాసం నుంచి ప్రారంభమైన ర్యాలీ రామ్‌మందిర్, రాజీవ్‌చౌక్, మార్కెట్ గుండా సిర్పూర్(టి)కు బయల్దేరింది. హరీశ్‌బాబు, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ తదితరులు ర్యాలీ ముందు ప్రత్యేక వాహనంలో ఎక్కి ప్రజలకు అభివాదం చేస్తూ బయల్దేరారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

కౌటాల: విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని డీఐఈఓ ఎస్.శంకర్ ఆకాంక్షించారు. కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ప్రయోజకులు కావాలన్నారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ బాలకిషన్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



శ్మశానవాటికకు మరమ్మతులేవి?

దహెగాం: భారీ వర్షాలకు పెద్దవాగు ఉప్పొంగడంతో మండలంలోని పెసరికుంట, చౌక, ఒడ్డుగూడ గ్రామాల సమీపంలో నిర్మించిన శ్మశానవాటికలు వరద తాకిడికి కొట్టుకుపోయాయి. రెండేళ్లయినా మరమ్మతు చేపట్టకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. రూ.లక్షలు వెచ్చించి నిర్మించి వాటిని పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వాటికి మరమ్మతు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పంటలపై అడవిపందుల దాడి



అడవిపందుల దాడిలో ధ్వంసమైన వరి

- కాపాడుకునేందుకు రైతుల ఆగచాట్లు
- తీవ్ర నష్టంతో ఆవేదన

ఆసిఫాబాద్‌రూరల్: పంటలపై అడవిపందులు దాడిచేయడంతో వందల ఎకరాలు దెబ్బతింటున్నాయి. వాటి బారి నుంచి పంటను కాపాడుకునేందుకు రైతులు ఆగచాట్లు పడుతున్నారు. అయినా పందులు మూకుమ్మడిగా దాడి చేసి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో తీవ్రనష్టం వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఈదులవాడ, చిర్రకుంట, బూర్గుడ, సిగరావుపేట్, కొమ్ముగూడ, గొల్లగూడ, మోతుగూడ, చిలాటిగూడ, సింగరావుపేట్, అప్పపల్లి గ్రామాల్లో 900 ఎకరాల వరకు వరి, 15 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. పంట చేతికి వచ్చే సమయంలో రాత్రి, పగలు తేడాలేకుండా అడవిపందులు దాడి చేసి నాశనం చేస్తున్నాయి. వేసిన పంటను పందుల బారి నుంచి రక్షించుకునేందుకు చేల వద్ద రైతులు గుడారం ఏర్పాటు చేసుకున్నారు. చలిలో వణుకుతూ ఇబ్బందులకు గురవుతున్నారు. అడవిపందుల దాడిలో పంట నష్టపోయిన తమకు అధికారులు పరిహారం చెల్లించాలని బాధిత రైతులు కోరుతున్నారు.



రైతు ఏర్పాటు చేసుకున్న గుడారం

పంటకు దోమతెగులు

ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో రైతులు వరి పంట సాగు చేశారు. ఈ క్రమంలో దోమతెగులు సోకింది. పంట కోత సమయంలో వరి నేలకు ఒరిగిపోయింది. దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఈ దఫా పంట కళకళలాడడంతో దిగుబడులపై ఆశలు పెట్టుకుంటే నిరాశనే మిగిలిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విశ్రాంత ఉద్యోగులకు అవగాహన



ఆసిఫాబాద్: పాల్గొన్న విశ్రాంత ఉద్యోగులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ శాఖ కేంద్రంలో శుక్రవారం విశ్రాంత ఉద్యోగులకు బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. బ్రాంచి మేనేజర్ రవికుమార్ మాట్లాడుతూ 73 ఏళ్ల విశ్రాంత ఉద్యోగులు కూడా బ్యాంకు రుణం పొందేందుకు అర్హులని, దరఖాస్తు చేసుకున్న రోజే రుణం మంజూరు చేస్తారని తెలిపారు. ప్రమాదంలో మరణించిన వారికి ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ పాలసీ నుంచి అర్హతకు అనుగుణంగా నగదు చెల్లిస్తారని పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగులకు బ్యాంకు ద్వారా అన్నిరకాల సేవలందిస్తామన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కర్నాగౌడ్, యూనిట్ అధ్యక్షులు రమేశ్, నాంపెల్లి శంకర్, బి.మధుసూదన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌టౌన్: మాట్లాడుతున్న అశోక్

కాగజ్‌నగర్‌టౌన్: పెన్షనర్లకు ఒక్కరోజులో రుణాలు అందేలా చూస్తామని చీఫ్ మేనేజర్ అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ఎస్‌బీఐలో శుక్రవారం నిర్వహించిన పెన్షనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్లు, సీనియర్ సిటిజన్లకు సహాయ సహకారం అందిస్తామన్నారు. సమావేశంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జయదేవ్ అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందిస్తాం

రెబ్బెన: ఖాతాదారులకు యూనియన్ బ్యాంకు మెరుగైన సేవలందిస్తోందని రెబ్బెన బ్రాంచి మేనేజర్ సత్యనారాయణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక దినవోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులతో కలిసి కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. బ్యాంకు ద్వారా అందచేస్తున్న బీమా పథకాలు, సేవింగ్, కరెంట్ ఖాతాలు, మ్యూచువల్ ఫండ్ తదితర సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఖాతాదారులు కుందారపు శంకరమ్మ, రవీందర్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మేనేజర్ సత్యనారాయణ

15న చదరంగం పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో ఈ నెల 15న తెలంగాణ ఓపెన్ టూ ఆల్ చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు అర్జున్ చెస్ అకాడమీ చైర్మన్ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 14లోగా 94908 73271, 897802 6306 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. జన్కాపూర్ సమీపంలోని టాటియా గార్డెన్‌లో ఈ పోటీలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ప్రతిభ చూపిన వారికి నగదు బహుమతులు ఉంటాయని, ప్రవేశం కోసం ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలో సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పట్టణ విద్యుత్ శాఖ అధికారి సదాశివ్ ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

నార్నూర్: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గురువారం వివిధ సబ్ సెంటర్ల నుంచి వచ్చిన గర్భిణులకు స్కానింగ్, రక్తపరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి విక్రమ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో గర్భిణుల ఆరోగ్యంపై ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని స్వీకరించాలన్నారు. రక్తహీనత ఉంటే ఐరన్ ట్యాబ్లెట్లు అందించాలని సూచించారు. వైద్య శిబిరంలో హెచ్‌ఈ చౌహాన్ నాందేవ్ పాల్గొన్నారు.

ప్రకాష్ అంబేద్కర్‌ను కలిసిన నాయకులు

నార్నూర్: భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ మనువడు ప్రకాష్ అంబేద్కర్‌ను శుక్రవారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలో నిర్వహించిన గిరిజనేతరుల సమావేశంలో మైనార్టీ రాష్ట్ర నాయకులు యునుస్ అక్బాని, గిరిజనేతరుల సంఘం అధ్యక్షుడు షేక్ దాదే అలీలు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరుల పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

దాజీ శంకర్ స్ఫూర్తితో పోరాడుతాం

తాంసి: స్వాతంత్ర సమరయోధుడు, ఆదిలాబాద్ మొదటి శాసనసభ్యుడు స్వర్గీయ దాజీ శంకర్ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడుతామని సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సావర్గాం గ్రామంలో దాజీశంకర్ 38వ వర్ధంతిని నిర్వహించారు. అనంతరం స్తూపం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు విలాస్, కుంటాల రాములు, అరుణ్, ముడుపు నళినిరెడ్డి, చిలుక దేవిదాస్, సట్వాజీ, రతన్, సతీష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ఇచ్చోడ: కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట విశ్వరూప మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 11న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మహాజన్ సోషలిస్టు పార్టీ నాయకులు దుబాక సుభాష్, సిరిసిల్ల భూమయ్య, చిటి రవి, ఆరెపెల్లి అశోక్, మచ్చ గంగారాం పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన

నెన్నెల: జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఓటు హక్కు వినియోగంపై మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కళాబృంద సభ్యులు బీఎల్‌ఓలు, ఐకేపీ వీఓఏలకు శుక్రవారం అవగాహన కల్పించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పాటలు, నృత్యాల ద్వారా వివరించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని సూచించారు. వంద శాతం పోలింగ్ అయ్యే విధంగా చూడాలని బీఎల్‌ఓలు, వీఓఏలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరలక్ష్మి, ఐకేపీ ఏపీఎం విజయలక్ష్మి, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ముల్కళ్ల మురళి, పోశం పాల్గొన్నారు.

కన్నెపల్లిలో ఓటు హక్కుపై అవగాహన

భీమిని: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా వినియోగించుకోవాలని డీఆర్‌డీఏ అధికారులు పేర్కొన్నారు. కన్నెపల్లి మండల కేంద్రంలో ఐకేపీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఓటు హక్కుపై పాటల ద్వారా కళాజాత బృందంతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం అశోక్, సీసీలు, వీఓఏలు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు మురళి, పోశం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జెండా పండుగ

రామకృష్ణాపూర్: పట్టణంలోని ఈద్గా వద్ద శుక్రవారం గ్యార్మీ షరీఫ్(జెండా పండుగ)ను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. జామా నమాజ్ తర్వాత ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో జెండాను ఏర్పాటు చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అన్నదానం చేపట్టారు. పట్టణ ఎస్సై రాజశేఖర్, ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



జెండా పండగలో పాల్గొన్న ఎస్సై, ముస్లింలు